సాక్షి
విజయనగరం
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



'నవోదయ'ంలో ఉజ్వల భవిష్యత్

ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టంకట్టి ఉజ్వల భవిష్యత్తునిచ్చే వేదిక నవోదయ విద్యాలయం.

- 8లో



జాతీయ చెస్ పోటీలకు రాష్ట్ర జట్టు

జాతీయస్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే జట్టు సిద్ధమైంది.

- 8లో

మంత్రి బొత్స నేడు జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం సాయంత్రం విజయనగరం జిల్లా కేంద్రంలోని తన నివాసానికి చేరుకుంటారు. 2వ తేదీ ఉదయం స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు.

రైతన్నకు వెన్నుదన్ను



పంటల సాగు లాభదాయకంగా మారాలంటే.. నేల సారం తెలియాలి. ఏ నేల ఏ పంట సాగుకు అనువైనదో చెప్పగలగాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతు చేతికి అందాలి. దీనికోసం విరివిగా పరీక్షలు జరగాలి. పోషకలోపాలు భర్తీ చేసుకునేలా సూచనలు ఇవ్వాలి. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ బృహత్తర క్రతువును దిగ్విజయంగా ముందుకు సాగిస్తోంది. ఊరికో రైతుభరోసా కేంద్రం, నియోజకవర్గానికో అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటుచేసి ఉచిత సేవలందిస్తోంది. పరీక్షల ఫలితాలను తెలియజేస్తూ రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

- భూసార పరీక్షలు ఉచితం
- నకిలీలకు చెక్ చెప్పేలా ఎరువులు, పురుగుమందులు, విత్తన పరీక్షలు
- నియోజకవర్గానికో అగ్రిటెస్టింగ్ ల్యాబ్
- పంటల సాగుకు ప్రభుత్వ సహకారం



నెల్లిమర్ల అగ్రి టెస్టింగ్ ల్యాబ్

నెల్లిమర్ల రూరల్:

జిల్లాలో 75 నుంచి 80 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. ఏడాది పొడవునా పంటల సాగులో నిమగ్నమవుతారు. దీనిని గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగును లాభదాయకంగా మార్చే క్రతువుకు శ్రీకారం చుట్టింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చడం, సాగు సూచనలు అందించేందుకు ఊరికో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువుల నాణ్యత పరిశీలనకు నియోజకవర్గానికో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చింది. రైతులకు పూర్తిగా ఉచిత సేవలు అందిస్తూ... పంటల సాగును లాభాలబాట పట్టించేందుకు చర్యలు చేపట్టింది. పంట మార్పిడికి ప్రాధాన్యమివ్వాలని రైతులకు హితబోధ చేస్తోంది. ఏ నేల ఏపంట సాగుకు అనువైనదో వ్యవసాయాధికారులతో గ్రామసభలు నిర్వహించి వివరిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం నెల్లిమర్ల, సారిక, చీపురుపల్లి, రాజాం, రామభద్రపురం, బొబ్బిలిలో ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల నుంచి సేవలందిస్తోంది.

విత్తనంపైనే దిగుబడి

ఏ పంట సాగులో అయినా విత్తనమే కీలకం. దీనిపైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. విత్తనం మంచిదైతే రైతులు మేలైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో వివిధ కంపెనీల విత్తనాలు, వివిధ రకాల ప్యాకింగ్‌ల్లో అందుబాటులో ఉంటున్నాయి. వీటిలో నాసిరకమైనవి, నాణ్యమైనవి ఏవో తెలియక రైతులు అయోమయానికి లోనవుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల విషయంలో రైతులు మోసపోకుండా ఉండేందుకు వీటికి పరీక్షలు నిర్వహించి నకిలీలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తోంది.

పరీక్షలు ఇలా...

విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల నాణ్యత పరీక్షలను పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం విశాఖపట్నం, తాడేపల్లిగూడెం, తిరుపతి, అమరావతి ప్రాంతాల్లో రీజనల్ కోడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల నుంచి నియోజకవర్గ స్థాయిలో ఉన్న ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం ఎరువులు, విత్తనాలు వస్తుంటాయి. ప్రభుత్వ లక్ష్యం మేరకు వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తన దుకాణాల్లో సేకరించిన నమూనాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా బ్యాచ్ నంబర్ కోడింగ్ చేసి రీజనల్ కేంద్రానికి పంపిస్తారు. అక్కడ నుంచి ఈ శాంపిల్స్ ఆయా నియోజకవర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపించి పరీక్షలు చేసి నివేదికలు ఇస్తారు. అయితే, వీటిలో నకిలీలను నిర్ధారిస్తే సంబంధిత దుకాణాలు, కంపెనీలపై చర్యలకు సిఫార్సు చేస్తారు.



విత్తన పరీక్షలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రైతులకు పరీక్షలు ఉచితం..



వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో సూక్ష్మ పోషకాలకు సంబంధించిన పరీక్షలే కాకుండా విత్తనం స్వచ్ఛత-నాణ్యత పరీక్షలు, విత్తనాల మొలక, తేమ శాతం, యూరియా, నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫేట్, డీఏపీ ఎరువులు పరీక్షలు చేస్తారు. పంట విత్తు సమయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అనుమానం ఉంటే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రైవేటు కంపెనీలకు సంబంధించిన డీలర్లు ఈ పరీక్షల కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మూడు న్యూట్రియంట్స్ (భాస్వరం, పొటాషియం, నత్రజని) కలిపి రూ.2,500, ఒక్కోదానికి రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నెల్లిమర్ల మండల కేంద్రంలో 2021లో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మూడేళ్ల కాలంలో ఇప్పటివరకు 221 విత్తన పరీక్షలు, 148 ఎరువుల పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

నెల్లిమర్ల అగ్రి ల్యాబ్‌లో ఇప్పటివరకు చేసిన పరీక్షల వివరాలు

సంవత్సరం	విత్తన పరీక్షలు	ఎరువుల పరీక్షలు
2021-22	39	28
2022-23	149	97
2023-24 (ఇప్పటివరకు)	40	23

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నాసిరకం విత్తనాలు, నకిలీ ఎరువులను గుర్తించడం, రైతులకు నాణ్యమైన ఉత్పాదకాలను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. రైతులందరూ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి. పంటల సాగులో నిపుణుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. పరీక్షలన్నీ పూర్తిగా ఉచితం. ఆయా ప్రైవేటు కంపెనీలు ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

– శ్రీలక్ష్మి, ఏఓ,
అగ్రి టెస్టింగ్ ల్యాబ్, నెల్లిమర్ల

అవగాహన కల్పించాలి



నకిలీ ఎరువులు, నాసిరకం విత్తనాల వినియోగంతో రైతులు మోసపోకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తేవడం సంతోషదాయకం. గతంలో ఏ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లపై అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి. సిబ్బంది దీనిపై దృష్టి సారించి రైతులకు అవగాహన కల్పించాలి.

– చందక త్రినాథ్, రైతు, సతివాడ గ్రామం

న్యూస్‌రీల్

నిలకడగా తోటపల్లి నీటి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు

గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద సోమవారం సాయంత్రం 6 గంటలకు 105 మీటర్లకు 103.62 మీటర్ల మేర నీటిమట్టం ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,550 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఒక గేటును ఎత్తివేసి 1026 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకు 1.69 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్టు ఏఈ కిశోర్ తెలిపారు. పాత కుడి కాలువకు 90 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 700 క్యూసెక్కులు, కుడిప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు పాలిటెక్నిక్ విద్యార్థి



క్రీడాకారుడిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి పశుసంవర్ధక కళాశాలలో పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పాతరపల్లి శంకర్ రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెస్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 42 కేజీల విభాగంలో విజేతగా నిలిచాడు. ఈ నెల 29, 30 తేదీల్లో అనకాపల్లి రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డా.కె.బసవరెడ్డి, అధ్యాపక సిబ్బంది సోమవారం అభినందించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సహకారంతో కెమిస్ట్–ప్రొడక్షన్, రిటైల్ సేల్స్ సూపర్‌వైజర్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని వీటీ అగ్రహారంలో ఉన్న టీటీడీసీ మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నైపుణ్య కళాశాలలో నాలుగు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. గత నెల 26న శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, మిగుల సీట్ల భర్తీకి ఈ నెల 2న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. 20–24 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువకులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు వారి బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌ఫొటోతో ఉదయం 9 గంటలకు టీటీడీసీ మహిళా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. వివరాలకు సెల్: 73867 13880, 94929 27844, 99888 53335 నంబర్లను సంప్రదించాలన్నారు.

'బయోపాట్స్' ప్రాజెక్టుకు బహుమతి



రేగిడి పాఠశాలలో విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రేగిడి: రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జి.లావణ్య రూపొందించిన 'బయోపాట్స్' ప్రాజెక్టు జాతీయ స్థాయిలో కన్సోలేషన్ బహుమతి సాధించిందని పాఠశాల హెచ్ఎం వావిలపల్లి లక్ష్మణరావు సోమవారం తెలిపారు. గీతా యంగ్ సైంటిస్టు ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని బూరవెల్లి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థిని గతనెల 6న ఆన్‌లైన్‌లో ప్రాజెక్టును సబ్‌మిట్ చేసింది. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల నుంచి 32 ప్రాజెక్టులు తుది పోటీలకు ఎంపికకాగా, అందులో బయోపాట్స్ ప్రాజెక్టుకు కన్సోలేషన్ బహుమతి వచ్చింది. బాలికను ఎంఈఓలు ఎం.వి. ప్రసాదరావు, బి.ఎరకయ్య, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఏజెన్సీలో అలజడి



ఆర్ఓపీ చేస్తున్న ఏపీఎస్పీ బలగాలు

మక్కువ: మావోయిస్టుల సంస్మరణ వారోత్సవ (గతనెల 28 నుంచి ఈ నెల 3 వరకు) పిలుపుతో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏఓబీ)లో అలజడి నెలకుంది. పోలీస్ ప్రత్యేక బలగాలు అప్రమత్తమయ్యాయి. వాహన తనిఖీలను ముమ్మరం చేశాయి. రోడ్డు కల్వర్టులను ఆర్ఓపీ (రోడ్డు ఓపెనింగ్ పార్టీ) నిశితంగా పరిశీలిస్తోంది. ఏజెన్సీలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తోంది. మక్కువ ఎస్ఐ జి.పైడిరాజు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఏపీఎస్పీ బలగాలు సరిహద్దు గ్రామాలను జల్లెడపడుతున్నాయి.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



సాయికి చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

సాలూరు: అధైర్యపడొద్దు.. అండగా ఉంటామంటూ క్యాన్సర్ బాధితురాలికి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభయమిచ్చారు. ఆరోగ్యపరంగా ఆదుకోవాలంటూ పాచిపెంట మండలం మడవలస గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు బంటుసాయి రాజన్నదొరకు విన్నవించింది. ఈ మేరకు ఆయన ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. మందుల కోసం రూ.30వేలు మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును రాజన్నదొర, మజ్జి శ్రీనివాసరావు బాధితురాలికి సోమవారం అందజేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఏ సాయం కావాలన్నా మమ్మల్ని అడగాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సాయి కుటుంబానికి రాజన్నదొర ప్రతినెలా రూ.2వేలు వ్యక్తిగతంగా అందజేస్తున్న విషయం తెలిసిందే.

ఒడిశాకు మరిన్ని సర్వీసులు!

- కొత్తగా విశాఖ నుంచి ఏడు బస్సులు
- ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన కొత్త ఒప్పందం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం నుంచి ఒడిశాకు ఆర్టీసీ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ నుంచి ఆ రాష్ట్రానికి 14 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇకపై కొత్తగా మరో ఏడు బస్సులను ప్రవేశపెట్టేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందంతో బస్సుల సంఖ్య పెంచేందుకు వీలవుతోంది. దీంతో ఒడిశాలోని జైపూర్, నవరంగ్‌పూర్, ఒనకడిల్లీ, పర్లాకిమిడిలకు ఒక్కోటి చొప్పున, గుణుపూర్‌కు మూడు బస్సులను కొత్తగా నడపనున్నారు. ప్రస్తుతం గుణుపూర్‌కు మూడు, జైపూర్‌కు మూడు, పర్లాకిమిడికి రెండు, రాయగడకు ఒకటి, ఒనకడిల్లీకి ఒకటి, దామన్‌జోడికి రెండు, నవరంగ్‌పూర్‌లకు రెండు చొప్పున నడుస్తున్నాయి. కొత్తగా ప్రారంభించబోయే వాటితో విశాఖ నుంచి ఒడిశాకు నడిచే బస్సుల సంఖ్య 21కి చేరనుంది. ఈ సర్వీసులను వివిధ ప్రాంతాల వారికి అనువుగా ఉండేలా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మీదుగా వేర్వేరు రూట్లలో నడుపుతారు. ఈ రూట్లలో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సర్వీసులను మాత్రమే తిప్పుతారు. ఈ కొత్త సర్వీసులను శ్రావణ మాసంలో ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

తప్పనున్న పన్నుల భారం

ఇన్నాళ్లూ మన ఆర్టీసీ బస్సులు ఒడిశాలో తిరగాలంటే ఆ రాష్ట్రంలో కూడా పన్నులు చెల్లించాల్సి వచ్చేది. అంతేకాదు.. ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లూ పర్మిట్లు పొందాలి. ఒప్పందంలో భాగంగా ఇకపై ఏ రాష్ట్రం బస్సులు ఆ రాష్ట్రంలో పన్నులు చెల్లిస్తే చాలు. పైగా ఒక పర్మిట్‌తో ఎన్ని ట్రిప్పులైనా తిరగవచ్చు.

బొబ్బిలి సిగలో మరో మణిహారం

- రూ.235.30 కోట్లతో మెసర్స్ సత్యా బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు
- ఈ నెలలోనే ఏపీఐఐసీ 30 ఎకరాల భూ కేటాయింపు
- వేగావతి నుంచి 1600 కిలోలీటర్ల నీటి సరఫరాకు అనుమతులు
- 200 మందికి ఉపాధి కలిగే అవకాశం



గ్రోత్ సెంటర్

బొబ్బిలి: బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కొద్దినెలల్లో మరో పరిశ్రమ ఏర్పాటుకానుంది. ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఇక్కడ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు 30 ఎకరాలు కేటాయించాలని ఏపీఐఐసీకి సూచించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం జూలై 21న జీఓ నంబర్ 64ను విడుదల చేసింది. వేగావతి నది నుంచి 1600 కిలోలీటర్ల నీటి సరఫరాకు అనుమతులు ఇస్తూ జీఓ నంబర్ 56ను విడుదల చేసింది. పరిశ్రమ ఏర్పాటైతే స్థానికులకు, ఇతరులకు కలిపి 200 మందికి పైగా ఉపాధి అవకాశం లభిస్తుందని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. గ్రోత్ సెంటర్‌లో మెసర్స్ సత్యా బయోఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్ కోసం 30 ఎకరాలు కేటాయించేందుకు ఈ వారంలోనే అనుమతులు ఇవ్వనున్నట్టు గ్రోత్ సెంటర్ అధికారులు తెలిపారు. స్థలం చూపించిన వెంటనే సంబంధిత యాజమాన్యం పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు.

రూ.235.30 కోట్లతో పరిశ్రమ

గ్రోత్ సెంటర్‌లో రూ.235.30 కోట్ల ఖర్చుతో మెజర్స్ సత్యా బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుచేసేందుకు అనుమతులు కోసం కంపెనీ యాజమాన్యం దరఖాస్తు చేసింది. ఇథనాల్ ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు కంపెనీ ప్రతినిధులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థలం కేటాయించాలని ప్రభుత్వం ఏపీఐఐసీకి ఇప్పటికే లేఖ రాసింది.

త్వరలోనే పనులు ప్రారంభం

ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వుల ప్రకారం కొద్ది రోజుల్లోనే మా ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వనున్నారు. యాజమాన్యానికి స్థలం అప్పగిస్తాం.

– యతిరాజు, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, శ్రీకాకుళంజోన్

ప్రతిభావంతులకే ప్రశంసాపత్రాలు

- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్వాతంత్య్ర దినోత్సవం
- జిల్లా కేంద్రంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు : కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, కార్యక్రమాల అమలులో మంచి ప్రతిభ, పనితీరు కనబరచి, నిర్దేశిత లక్ష్యాలు సాధించిన వారికే ప్రశంసాపత్రాల కోసం సిఫార్సు చేయాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఒక్కో ప్రభుత్వ శాఖ నుంచి ముగ్గురికి మించకుండా ప్రశంసాపత్రాల కోసం ఆగస్టు 5వ తేదీలోగా అన్ని ప్రభుత్వ శాఖలు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. సాంస్కృతిక ప్రదర్శనలు 25 నిముషాలు మించకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ మైదానంలో ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరిస్తామన్నారు. దీనికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పదిహేను ప్రభుత్వ శాఖలు తమ అభివృద్ధి కార్యక్రమాలను తెలుపుతూ శకటాలను ప్రదర్శించాలని, పన్నెండు ప్రభుత్వ శాఖలు తమ ఉత్పత్తులపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యం, గ్రామీణ నీటిసరఫా, పీఆర్ ఇంజినీరింగ్, విద్యాశాఖ, గృహనిర్మాణ, మహిళా శిశు సంక్షేమ, అటవీ, డ్వామా, ఏపీఎంఎస్ఐడీసీ, మౌలిక వసతులు, ఈపీడీసీఎల్, తదితర శాఖలతో పాటు అగ్నిమాపక, పోలీస్ శాఖల శకటాల ప్రదర్శన ఉంటుందన్నారు. వేడుక అనంతరం నగరంలోని ముఖ్యమైన మార్గాల్లో ప్రభుత్వ శకటాల ప్రదర్శన జరిగేందుకు పురపాలక, పోలీస్‌శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ట్రైనీ కలెక్టర్ బి.వెంకట్ సహాదిత్ నాగ్, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, పద్మలత, బి.సుదర్శనదొర తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ ఉండకూడదు

విజయనగరం అర్బన్: బడిఈడు పిల్లలందరూ కచ్చితంగా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యా, సచివాలయ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న సురక్ష, ఎడ్యుకేషన్ సర్వే, గడప గడపకు మన ప్రభుత్వం, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, జగనన్నకు చెబుదాం, గృహనిర్మాణం, వ్యాధుల నియంత్రణ, అర్బన్ పీహెచ్‌సీల నిర్మాణం తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. శాఖలవారీగా పనుల పురోగతిని తెలుసుకున్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్-1 పరీక్షలు

- మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ప్రశ్నపత్రాలు
- 1-8వ తరగతి వరకు సీబీఏ విధానంలో పరీక్షల నిర్వహణ
- 9, 10వ తరగతులకు ఫార్మేటివ్ పద్ధతిలో పరీక్షలు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 1.80లక్షల మంది విద్యార్థులు



రామభద్రపురం చొక్కాపువీధి ప్రాథమిక పాఠశాలలో సీబీఏ విధానంపై 5వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

రామభద్రపురం:

ఫార్మేటివ్-1 పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) విడుదల చేసింది. ఆగస్టు 1 నుంచి 4వ తేదీ వరకు 1-10వ తరగతులకు ఫార్మేటివ్-1 పరీక్షలు జరగనున్నవి. అన్ని తరగతులకు ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలను సరఫరా కానున్నాయి. 1-8 తరగతుల వరకు క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. వీరందరికీ ప్రశ్నపత్రంతో పాటు జవాబుపత్రాలకు బదులు ఓఎంఆర్ షీట్‌లు ఇస్తారు. కాంపిటేటివ్ పరీక్షల మాదిరిగానే విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేసి జవాబు పత్రాన్ని నింపాలి. 9, 10 తరగతులకు మాత్రం పాతవిధానం (నిర్మాణాత్మక మూల్యాంకనం)లోనే పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలతో పాటు, అన్ని ప్రైవేటు యజమాన్యాలు తప్పనిసరిగా ఫార్మేటివ్-1 పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంది. వీరందరికీ ప్రభుత్వమే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు అందజేస్తుంది. గతంలో జరిగిన ప్రశ్న పత్రాల లీకేజీ ఘటనల నేపథ్యంలో విద్యాశాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూ ఆర్ కోడ్‌ను కేటాయించింది. పరీక్ష పేపర్లను ఎవరు లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీకైనా క్షణాల్లో తెలిసిపోతుంది. ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే ఫార్మేటివ్-1 పరీక్షలను విజయనగరం జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1.80లక్షల మంది విద్యార్థులు రాయనున్నారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్య శాల మదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు ద్వారా అభ్యసన లోపాలను గుర్తిస్తారు. విద్యార్థులు వెనుకబడిన అంశాలను గుర్తించి, ప్రత్యేక బోధన ద్వారా వారు సాధారణ స్థాయికి చేరేలా చూస్తారు.

ద్విభాషా ప్రశ్నపత్రాలు...

- విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా ప్రశ్నపత్రాలు ద్విభాషా విధానంలో రూపొందించారు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్లంలో ఉంటుంది.
- ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. 10 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానం, 5 మార్కులకు రాత పూర్వకంగా జవాబులు రాయాలి. విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను సమగ్రంగా అంచనావేసేలా ప్రశ్నలు ఉంటాయి.
- మెకానికల్, అండర్ స్టాండింగ్, అప్లికేషన్ పద్ధతిలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు..



పరీక్షల ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ షీట్లు మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఉన్నాయి. ప్రశ్నపత్రాలకు ఎంఈఓలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షకు ముందు పాఠశాలలకు ప్రశ్నపత్రాలను అందజేస్తారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన మార్గదర్శకాలను ఎంఈఓలు, హెచ్ఎంలకు జారీ చేశాం.

– బి.లింగేశ్వరరెడ్డి,
జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం

క్లుప్తంగా

కదిలిన ఏనుగులు



సరసనాపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

రేగిడి: మూడురోజుల క్రితం రేగిడి మండలం లోకి ప్రవేశించిన ఏనుగులు మళ్లీ వంగర మండలం సంగాం సమీపంలోకి వెళ్లిపోయాయి. సరసనాపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు ఇవి తిష్ఠవేశాయి. ఏనుగులు గ్రామం నుంచి వెళ్లిపోవడంతో సరసనాపల్లితో పాటు కందిశ, జోరుబందల గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి గ్రామస్తులతో సోమవారం మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ తొలగించినట్లు తహసీల్దార్ ఈ సందర్భంగా అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్తు సామగ్రి దగ్ధం



కాలిపోయిన వస్తు సామగ్రి

రేగిడి: మండల పరిధి పనసలవలస గ్రామానికి చెందిన బూరాడ సత్యం ఇంటిలో సోమవారం వేకువజామున షార్ట్ సర్క్యూట్ జరిగి వస్తుసామగ్రి పూర్తిగా కాలిపోయింది. అందరూ నిద్రిస్తున్న సమయంలో వేకువజామున ఫ్రిడ్జ్ వైర్లకు మంటలు వ్యాపించి ఇల్లంతా పొగ ఆవరించింది. నిద్రలో ఉన్న సత్యం, భార్య రుక్మిణి పొగవాసన పసిగట్టి వెంటనే మేల్కొన్నారు. కేకలు వేసి స్థానిక సర్పంచ్ గేదెల గోవిందనాయుడుకు ఫోన్‌చేయడంతో హుటాహుటిన ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్నవారిని బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసేలోపే ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయింది. డాబా ఇల్లు కావడంతో ఇరుగు పొరుగువారికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. వ్యవసాయ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు సామగ్రి కాలిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఇంటిగోడలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

హెచ్‌ఎం పోస్టులు భర్తీచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: ఐటీడీఏ పరిధి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీ హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌కు గిరిజన సంఘం నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్ తదితరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమశాఖలో అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు, సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి తక్షణం పీజీ హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

మాజీ సైనికుల సమావేశం



సమావేశమైన మాజీ సైనికులు

బొబ్బిలి: పాత బొబ్బిలిలో వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రెడ్డి దామోదర రావు, గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి, రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లకు సంబంధించి చర్చించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆర్‌ఏ నాయుడు, కార్యదర్శి వీఎస్ శర్మ, ట్రెజరర్ గెంబలి శ్రీనివాస రావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

వెల్లువెత్తిన వినతులు

- సత్వర పరిష్కానికి కలెక్టర్ ఆదేశాలు

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రజావినతుల కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గ్రీవెన్స్ విభాగానికి 407 వినతులు అందగా వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 287, హౌసింగ్ శాఖ 60, గ్రామ వార్డు సచివాలయాల శాఖ 25, మున్సిపాలిటీ 10, అటవీ శాఖకు 10, డీఆర్‌డీఏ 7 ఇతర విభాగాలకు మరో 8 వినతులు వచ్చాయి. కలెక్టర్ నాగలక్ష్మి, ట్రైనీ కలెక్టర్ వెంకట్ సహాదిత్ నాగ్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సుదర్శన దొర, సూర్యనారాయణ తదితరులు వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు.

కలెక్టర్‌కు ఆర్మీ అధికారుల కృతజ్ఞతలు

జిల్లాలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరించిందని పేర్కొంటూ ఆర్మీ అధికారులు గురుచరణ్ సింగ్, వినయ్ కుమార్‌లు కలెక్టర్ నాగలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెను కలిసి జ్ఞాపికను బహూకరించారు. అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సహకారం అందించడం వల్లే ర్యాలీ ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తిచేయగలిగామని సంతోషం వెలిబుచ్చారు.

ఉత్తమ ఆరోగ్య మిత్ర అవార్డు బహూకరణ

జిల్లాలో జూన్ నెలకు ఉత్తమ ఆరోగ్య మిత్రగా ఎంపికైన గజపతినగరం ఏరియా ఆస్పత్రి ఆరోగ్య మిత్ర మెట్ట సూర్యకుమారికి కలెక్టర్ నాగలక్ష్మి రూ.5 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆమె సామాన్య ప్రజల నుంచి వచ్చిన 34 ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని,సంబంధిత పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్బీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్. శ్రీనివాస రావు, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

ఏం జరిగిందో? ఏమో?

- లాడ్జిలో హతురాలి వివరాలు లభ్యం
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో ఆదివారం కలకలం రేపిన హత్యకేసులో పోలీసులు పురోగతి సాధించారు. చందన్ లాడ్జిలో వెలుగుచూసిన హత్యోదంతంలో హతురాలిని దేవరాపల్లికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మ(48)గా నిర్ధారించారు. కాగా ఈశ్వరమ్మ ఒంటిపైన ఉన్న బంగారం కోసమే హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. ఆమె కొన్నేళ్లుగా ఎస్.కోటలోనే నివాసం ఉంటోంది. అయితే ఈ హత్య కేసులో నిందితుడు ఎవరు? ఏ ఉద్దేశంతో హత్య చేశాడు? హత్య జరిగి ఎన్ని రోజులైంది? కేవలం బంగారం కోసమేనా? పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయాలు తెలియాల్సి ఉంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే పూర్తిస్థాయి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. మరిన్ని కచ్చితమైన సాక్ష్యాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.



హతురాలు ఆరిపాక ఈశ్వరమ్మ

హత్య కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

రాజాం సిటీ: హత్య కేసులో రాజాంకు చెందిన నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను న్యాయస్థానం విధించింది. రాజాంలో 2018 సెప్టెంబర్ 17వ తేదీన కొండేటి అప్పారావు (65)పై అదే గ్రామానికి చెందిన కొండేటి పోలీస్, కొండేటి రమణ, చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీల దాడికి తెగబడ్డారు. ఈ దాడిపై మృతుడి బంధువులు కనకరాజు, మహేశ్వరరావులు ఫిర్యాదు చేశారు. దాడి అనంతరం అప్పారావు చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ఈ ఐదుగురిపై రాజాం పోలీసులు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కోర్టులో హాజరు పరచగా చావుకు ఐదుగురు బాధ్యులని రుజువు కావడంతో కొండేటి రమణ, కొండేటి చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీలకు పదేళ్ల కఠిన కారాగార శిక్షను మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి బి.భాస్కరరావు తీర్పునిచ్చారు. మరో ముద్దాయి కొండేటి పోలీసు ఇటీవల మృతి చెందారు. దీంతో నలుగురికి శిక్ష ఖరారు చేశారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్షను అమలు చేయాలని తెలిపారు. అలాగే వేర్వేరు సెక్షన్ల కింద ఈ నలుగురికే మరో రెండేసి సంవత్సరాల పాటు కారాగార శిక్ష వేశారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునిచ్చారు. ఈ కేసు దర్యాప్తు రాజాం సీఐ వేణు కుమార్, వేణుగోపాలరావు చేయగా, ఫ్యామిలీ కోర్టు పీపీ వాన కృష్ణ చంద్ వాదించారు.

40 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

సీతంపేట: అక్రమంగా రవాణా చేస్తున్న 40 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. కొత్తకోట గ్రామానికి ఎం.మణికంఠ, కె.గంగారావులు అక్రమంగా సారా రవాణా చేస్తుండగా కుడ్డపల్లి ఈతమానుగూడ పరిసరాల్లో పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.



సారాతో పట్టుబడిన వ్యక్తులు

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

విజయనగరం క్రైమ్: విశాఖ నుంచి విజయనగరం వచ్చిన ప్యాసింజర్ నుంచి ప్రయాణికులు అంతా దిగి వెళ్లిపోయారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో రైల్వే సిబ్బంది తలుపులు మూసేందుకు రైలెక్కగా బాత్‌రూమ్ వద్ద గులాబీ రంగు షర్ట్, దుప్పటి ధరించి ఉన్న సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయసు కలిగిన వృద్ధుడు మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు రైల్వే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదుచేశారు. అలాగే వీటీ అగ్రహారం బీసీకాలనీకి వెళ్లే దారిలో ట్రాక్ పక్కన శరీరంపై బట్టల్లేకుండా 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రెండు మృతదేహాలను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి జీఆర్‌పీ ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్యాసింజర్‌లో బాత్‌రూమ్ వద్ద మృతిచెంది ఉన్న వృద్ధుడు

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి సోమవారం వేకువజామున మృతిచెందాడు. విజయనగరం స్టేషన్‌లోని ఐదో నంబర్ ఫ్లాట్‌ఫామ్‌పై జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు వెళ్లేందుకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎక్కడానికి విశాఖలో వెయిట్ చేస్తున్న ఎస్.ధనరాజ్ (54) రైలు ఆలస్యంగా నడుస్తుందన్న విషయం తెలుసుకున్నాడు. రాత్రి 9 గంటలకు రావాల్సిన రైలు మూడు గంటలు ఆలస్యంగా వచ్చింది. అప్పటివరకూ అక్కడే కుర్చీలో కూర్చున్న ధనరాజ్ నిద్రలోకి జారుకున్నాడు. రాత్రి 2 గంటలు దాటిన తర్వాత మెలకువ వచ్చింది. ఎదురుగా హౌరా వైపు వెళ్తున్న ఫలక్‌నుమా కనిపించే సరికి అదే తాను ఎక్కాల్సిన రైలు అని భావించి పొరపాటున ఎక్కేశాడు. రైలు విజయనగరం వచ్చేసరికి స్టేషన్ చూసి నివ్వెరపోయాడు. ఇంతలో రైలు కదలడంతో రైల్లోంచి దిగిపోయేందుకు ప్రయత్నించి ఫ్లాట్‌ఫామ్, రైలు మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో చేతులు, కాళ్లు తెగిపడిపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారమందించి మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్లాట్‌ఫాంపై పడి ఉన్న మృతుడు ధనరాజ్

'నవోదయ'ంలో ఉజ్వల భవిష్యత్



కిల్తంపాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయం

- ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఆగస్టు 10 వరకు గడువు
- ఆరు నుంచి 7వరకు ప్రాంతీయ, మాతృభాషల్లో బోధన
- పదో తరగతి వరకు సీబీఎస్‌ఈలో బోధన

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టంకట్టి ఉజ్వల భవిష్యత్తునిచ్చే వేదిక నవోదయ విద్యాలయం. అందుకే ఈ విద్యాలయంలో పిల్లల్ని చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడుతుంటారు. ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఆధారం. ఇందులో ప్రతిభ చూపితే సీటు ఖాయం. 2024–25 ఏడాదికి సంబంధించి ప్రవేశపరీక్ష నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చునని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో కేంద్రం జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. ఈ విద్యాలయాల్లో 6 నుంచి 12వ తరగతివరకు తరగతులు కొనసాగిస్తున్నారు. ఆరు నుంచి 7వరకు ప్రాంతీయ, మాతృభాషల్లో బోధన సాగుతుంది. గణితం, సైన్స్, పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో చెబుతున్నారు. పదోతరగతి వరకు సీబీఎస్‌ఈ అమలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు

ఎస్‌కోట మండలంలోని కిల్తంపాలెంలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 6వతరగతిలో 80 సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.ఇందుకు ఆగస్టు 10వతేదీ వరకు గడువు విధించారు. అర్హులైన విద్యార్థులు సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్లు), మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రిజర్వేషన్ విధానం..

ఆరవ తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15శాతం, ఎస్సీలకు 7.5శాతం, బాలికలకు 1/3 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వరుసగా 3,4 వతరగతి చదివి అదే పాఠశాలలో ప్రస్తుతం 5వతరగతి చదువుతున్న వారు అర్హులు.నవోదయలో ఉమ్మడి జిల్లా వారీగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

వసతుల కల్పన భేష్

ఎస్‌కోట మండలంలోని కిల్తంపాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉత్తమ బోధన అందిస్తున్నారు.విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక సముదాయాలు కొలువుదీరాయి. పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడంతో విద్యాలయం వృక్షాలతో విరాజిల్లుతోంది. విద్యాలయం మొత్తం సీసీ రోడ్లు నిర్మించారు. స్మార్ట్ తరగతులు కొనసాగిస్తున్నారు. డ్రాయింగ్‌టైలర్నింగ్, ప్రయోగాత్మక విద్యను అందిస్తున్నారు. సైన్స్,కంప్యూటర్ ల్యాబ్‌ల సదుపాయం ఉంది.

మంచి అవకాశం...



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇదో గొప్ప అవకాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే నవోదయలో సులభంగా ప్రవేశం పొందవచ్చును.

– వి.దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, కిల్తం పాలెం,విజయనగరం

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రతి వారం నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై సత్వరమే క్షేత్ర స్థాయిలో విచారించి నాణ్యమైన పరిష్కారం చూపించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌తో కలిసి ప్రజల నుంచి 98 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామపంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి సూర్యారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి ఎం.డి.గయాజుద్దీన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలను స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్న జట్టు సిద్ధమైంది. నాలుగు రోజుల పాటు విజయనగరంలోని టీటీడీ కల్యాణ మంటపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన పోటీల్లో ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన ఎం.శ్రీనివాసరావు, కోనసీమ జిల్లాకు సాత్విక్, విశాఖ జిల్లాకు చెందిన ఎం.వెంకటరుత్విక్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మజ్జి రామ్‌చరణ్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మస్తాన్ బాబు, జిల్లా అధ్యక్షుడు బీపీ రావు, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి ఎం.గణేష్‌నాయుడు, న్యాయ నిర్ణేతలు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జీవీ కుమార్, ఫిడే ఆర్బిటర్ పవన్ రాతీలు అభినందించారు.

సార్వత్రిక విద్య ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురం టౌన్: సార్వత్రిక విద్య ప్రవేశాల పోస్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అక్రిడేటెడ్ ఇనిస్టిట్యూషన్ల (ఏఐ)లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలని, ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 25 లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకూ అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారని చెప్పారు.

మీ సేవ చార్జీలు అదనం

పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,150 చెల్లించాలన్నారు. ఇంటర్‌మీడియట్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్సీ, మైనారిటీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాలని వివరించారు. ఈ ఫీజులకు అదనంగా మీసేవ చార్జీలు 36 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి ఉండదన్నారు. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డ్ షీట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌మీడియట్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెస్ట్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణపత్రం, దివ్యాంగులు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాజాం: పట్టణంలోని అమ్మవారికాలనీ రెండవ లైన్‌లో రోడ్డుపై దర్శనమిచ్చిన క్షుద్రపూజల వస్తువులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. సోమవారం ఉదయం కాలనీవాసులు లేచి ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకుంటుంగా, వీధి మధ్యలో సీసీ రోడ్డుపై ఎండుమిరప కాయలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ కలిపిన అన్నం, కోడిగుడ్లు పడి ఉండడాన్ని మహిళలు గమనించారు. వెంటనే భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రాజాం టౌన్ సీఐ రవికుమార్ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి ఆరాతీశారు. పట్టణ పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి క్లీన్ చేయించారు. ఇదిలా ఉండగా ఈ వస్తుసామగ్రి అంతా క్షుద్రపూజలకు సంబంధించినదని పలువురు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జనావాసాల మధ్య ఇలాంటి భయానక వస్తుసామాగ్రి పడి ఉండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలో జరుగుతున్న ఇటువంటి ఘటనలపై పోలీసులు దృష్టిసారించి, భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలనీలోని సీసీ రోడ్డు మధ్యలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ సామగ్రి